ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 27.0 । కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY

5

జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు

గురువారం 4 సెప్టెంబరు 2025



'సుంకేసుల'కు పెరిగిన వరద

రాజోలి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండల కేంద్రం శివారులోని సుంకేసుల జలాశయానికి వరద ఉధృతి కొంత పెరిగింది. బుధవారం ఎగువ నుంచి 80 వేల క్యూసెక్కులు వరద వస్తుండటంతో, 18 గేట్ల ద్వారా 78 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ మహేందర్ రెడ్డి తెలిపారు. ప్రాజక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 292 మీటర్లు కాగా, ప్రస్తుతం 291.30 మీటర్లకు చేరింది. గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.954 టీఎంసీ నీరు నిల్వ ఉంది. కేసీ కెనాల్‌కు 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



నిరసన దీక్షలో మాట్లాడుతున్న తల్లోజు ఆచారి

హామీలను విస్మరిస్తే సీఎం ఇంటిని ముట్టడిస్తాం

-జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి

కల్వకుర్తి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అధికారం కోసం అబద్ధపు హామీలిచ్చి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి హామీలను విస్మరించడం సరికాదని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో కల్వకుర్తిలో చేపట్టిన నిరసన దీక్షకు ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రెండు లక్షల రుణమాఫీతో పాటు అర్హులకు పింఛన్లను రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు పెంచుతామన్న హామీలు ఎక్కడా అమలయ్యాయని విమర్శించారు. 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేసేవరకు గ్రామగ్రామానా దీక్షలు చేపడతామని తెలిపారు. అప్పటికీ స్పందించకపోతే సీఎం ఇంటినే ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో నాయకులు దుర్గాప్రసాద్, కృష్ణగౌడ్, నరసింహ, రాంభూపాల్‌రెడ్డి, వివేకానంద, రాఘవేందర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, గంగాధర్ తదితరులు ఉన్నారు.

చదువు, సాగునీరే..
మా ఎజెండా

- అవి లేకపోవడం వల్లే పాలమూరు ప్రజలు వెళ్లారు
- కేసీఆర్‌ను ఎంపీని చేసినా జిల్లాకు న్యాయం జరుగలేదు
- ఎత్తిపోతల పథకాలు పూర్తి కాలేదు.. పీయూ పీజీ కాలేజీలా మిగిలిపోయింది
- పాలమూరు బిడ్డ సీఎం అయ్యాక లా, ఇంజనీరింగ్, ట్రిపుల్ ఐటీ వచ్చాయి
- 14 నియోజకవర్గాలకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు చేశాం
- విద్య, సాగు నీటి రంగాలకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు
- నారాయణపేట - కొడంగల్ లిఫ్టునకు ఎన్‌జీటీకి వెళ్లి అడ్డుపుల్లలు వేస్తున్నారు
- పేదరికానికి పాలమూరు ఎగ్జిబిషన్ కావొద్దు.. ప్రగతి పథానికి వేదిక కావాలి
- మూసాపేటలో ఎస్‌జీ కార్నింగ్ యూనిట్ ప్రారంభంలో సీఎం రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో(ఎడమ నుంచి) ఎమ్మెల్యే జీఎంఆర్, కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మేఘారెడ్డి, చిట్టెం పర్ణికారెడ్డి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): 'ఏళ్లుగా పాలమూరు జిల్లా వలసలకు మారుపేరుగా ఉంది. బాక్రానంగల్, నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్పీ ఇలా దేశంలో ఏ ప్రాజెక్టు కట్టినా తట్ట పని, మట్టి పని, పార పనిలో పాలమూరు వలస జీవుల పాత్ర ఉంది. కష్టపడేతత్వం ఉన్న పాలమూరు ప్రజలు ఉన్నత స్థాయిలో రాణించకపోవడానికి ఎ డ్యుకేషన్, ఇరిగేషన్ లేకపోవడమే ప్ర ధాన కారణం. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం వాటినే ఎజెండాగా తీసుకుని పనిచేస్తుంది. పేదరికానికి ఇకపై పాలమూరు ఎగ్జిబిషన్ కాదు. ప్రగతి పథానికి వేదిక కావాలి" అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలోని మూసాపేటలో ఉన్న ఎస్‌జీ కార్నింగ్ పరిశ్రమలో రెండో యూనిట్ ప్రారంభోత్సవానికి సీఎం బుధవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ఇకపై నూతన పరిశ్రమలకు వేదిక అవుతుందని, జిల్లా ప్రజలకే కాకుండా రాష్ట్రంలోని ప్రజలకు ఉపాధి ఇక్కడ దొరుకుందని తెలిపారు. ఏళ్లుగా పాలమూరు నిరాదరణకు గురైందన్నారు. అందుకే కేసీఆర్‌ను పాలమూరు నుంచి గెలిపిస్తే.. ఈ ప్రాం తానికి సముచిత న్యాయం చేయలేదన్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేయలేదని అన్నారు. పాలమూరు యూనివర్సిటీ కాంగ్రెస్ హయాంలో వస్తే దాన్ని పట్టించుకోకుండా పీజీ కాలేజీకి పరిమితం చేశారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంజనీరింగ్, లా కాలేజీలు తెచ్చామని అన్నారు. కొత్తగా డిగ్రీ కాలేజీలు

(మిగతా 6లో..)

హైదరాబాద్- బెంగళూరు డిఫెన్స్ కారిడార్..

బ్రహ్మోస్ మిసైల్ తయారీ యూనిట్ స్థాపనకు రక్షణశాఖ ఈ ప్రాంతంలో పరిశీలన జరిపిందని, త్వరలో ఈ యూనిట్ ఏర్పాటైతే.. మరిన్ని రక్షణ రంగ పరిశ్రమలు ఏర్పాటవుతాయని అన్నారు. దీనికి స్కిల్డ్ వర్కర్ల అవసరం ఉందన్నారు. అన్ని నియోజకవర్గాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటుపై నివేదిక అందజేయాలని, అప్పుడే ఉన్నత ఉద్యోగాలు వస్తాయని ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డికి సూచించారు. ఇప్పటికే దేవరకద్ర నియోజకవర్గంలో డ్రైపోర్టు ఏర్పాటు అంశం పరిశీలనలో ఉందని, హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారిని డిఫెన్స్ కారిడార్‌గా మార్చుతామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ భూముల వివరాలను సేకరించి పంపించాలని, ఏ పరిశ్రమకు ప్రతిపాదన వచ్చినా పాలమూరులోనే పెట్టే విధంగా ఈ ప్రాంత బిడ్డగా కృషి చేస్తానని అన్నారు. కుర్చీలో కూర్చున్న వారు తమను నమ్ముకున్న వారికి ఏదో చేయాలని ఉంటుందని, తనకు ఏ అవకాశం వచ్చినా మొదటి ముద్ద పాలమూరుకే పెడతానన్నారు.

ఎమ్మెల్యే సవాల్‌ను స్వీకరిస్తున్నాం

- చేసిన పనుల్లో రాష్ట్రం, కేంద్రం నిధులెంత?
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

గద్వాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిపై గద్వాల ఎమ్మెల్యే చేసిన సవాల్‌ను బీజేపీ స్వీకరిస్తున్నదని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గద్వాలలో మీరు ఎంత అభివృద్ధి చేశారు? అందులో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులెంత? గ్రామాలవారీగా మునిసిపాలిటీ వారీగా వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. గద్వాలలో గుంతలమయం అయిన రోడ్లను చూస్తే మీరు ఎంత అభివృద్ధి చేశారో తెలుస్తుందని ఎద్దేవా చేశారు. పట్టణంలో ఉన్న పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను లాక్కొని వారిని రోడ్డున పడేయడమేనా మీ అభివృద్ధి అని ప్రశ్నించారు. శెట్టి ఆత్మకూర్ వద్ద ఐటీఐ కాలేజీ తెస్తే దానిని భూస్థాపితం చేయడమేనా మీ అభివృద్ధి అని ప్రశ్నించారు. నెట్టంపాడు 99వ,100వ ప్యాకేజీలకు నిధులను తీసుకరావడంలో మీ అసమర్థతను చూసి సిగ్గుపడుతున్నామన్నారు. నమ్మి ఓట్లు వేసిన గుర్రం గడ్డ ప్రజలకు నేటికి బ్రిడ్జినిర్మాణం పూర్తి చేయలేదని విమర్శించారు. గట్టు ఎత్తిపోతల పథకంకు మూడు సార్లు శంకుస్థాపన చేసి పనులు మూలన పడటమేనా మీ అభివృద్ధి అన్నారు. అనుచరులు కబ్జాలు, ఇసుక, మట్టి దందాలు 10 శాతం భూమి కబ్జాలు చేసి అభివృద్ధి పడుతున్నది ఎవరో ప్రజలకు తెలుసు అని విమర్శించారు. గద్వాల విద్యాభివృద్ధి పూర్తిగా వెనకబడిందని, అదనపు గదులు, ఆధునికీకరణ కనీస వసతులు లేకపోవడం వంటివి చూసి కూడా మీరు అభివృద్ధి గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ఎంపీ డీకే అరుణ అభివృద్ధి గురించి మీరు మాట్లాడటం కాదు, ప్రజల వద్దకు వెళితే చెబుతారన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎగ్బోటే, శ్యామ్‌రావు పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, నాయకులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక అందించాలి

తుమ్మిళ్ల ఇసుక రీచ్‌ను పరిశీలించిన టీజీఎండీసీ ఎండీ భవేష్ మిశ్రా



రీచ్ వద్ద డంప్ చేసిన ఇసుకను పరిశీలిస్తున్న టీజీఎండీసీ ఎండీ భవేష్ మిశ్రా

6

నేటి నుంచి రాష్ట్రస్థాయి
బ్యాడ్మింటన్ టోర్నీ

- ఉమ్మడి 10 జిల్లాల నుంచి పాల్గొననున్న 350 మంది క్రీడాకారులు
- నేడు క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు
- 5న పోటీలను ప్రారంభించనున్న మంత్రి శ్రీహరి, ఎమ్మెల్యే యెన్నం



ఇండోర్‌స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో గురువారం నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రస్థాయి 11వ సబ్ జూనియర్ అండర్-13 బాల, బాలికల బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించనున్నారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్(ఎండీబీఏ) అధ్యక్షుడు శ్యామ్ సుందర్‌గౌడ్, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఎండీబీఏ సెక్రటరీ ఎల్.రవికుమార్, టోర్నీ పరిశీలకుడు సుధాకర్ ఏర్పాట్లను పరిశీలించారు. 10 జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు, 11 మంది ఆఫీషియల్స్ పాల్గొనున్నారు. 4న క్వాలిఫయింగ్ రౌండ్, 5 నుంచి 7 వరకు డబుల్స్, సింగిల్స్ విభాగాల్లో మెయిన్ డ్రా పోటీలు నిర్వహించనున్నారు. 4 సింథటిక్ కోర్టుల్లో పోటీలు జరుపనున్నారు. క్రీడాకారులకు వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నారు. ఈ నెల 5న ఉదయం 10 గంటలకు ఇండోర్ స్టేడియంలో టోర్నీని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటీ శ్రీహరి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించనున్నారు.

విజయవంతంగా నిర్వహిస్తాం..

మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో గురువారం నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రస్థాయి అండర్-13 బాల బాలికల బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహిస్తున్నాం. 10 జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. అందరి సహకారంతో టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తాం. జిల్లాకు రాష్ట్రస్థాయి టోర్నీ నిర్వహించే అవకాశం రెండో సారి రావడం సంతోషంగా ఉంది.

-ఎస్.శ్యామ్‌సుందర్‌గౌడ్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు

విఘ్నాలు తొలగించు విఘ్నేశా



గద్వాల పట్టణంలోని రెవెన్యూ కాలనీలో ప్రతిష్ఠించిన శివతాండవ గణపతి

మరిన్ని చిత్రాలు 6లో..)

విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకోవాలి

- వసతి గృహం శుభ్రంగా ఉండాలి : కలెక్టర్ బీఎం సంతోష్

ఇటిక్యాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల విషయంలో అధికారులు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశించారు. బుధవారం ఆయన ఇటిక్యాలలోని సాంఘిక సంక్షమ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ముందుగా వంట గదిని, సరుకులను, తరగతి గదులను, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఉపాధ్యాయులతో మాట్లాడి వసతి గృహం, భోజనం, శుభ్రత అంశాలపై ఎక్కడా నిర్లక్ష్యం వహించొద్దని ఆదేశించారు. మెనూ తప్పకుండా పాటించాలని, నాణ్యతగా పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈఏడాది పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వంద శాతం ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రిన్సిపాల్ సురేశ్‌ను ఆదేశించారు. ఆయనతో పాటు తహసీల్దార్ వీరభద్రప్ప ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

ఇటిక్యాల మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను కలెక్టర్ బీఎం సంతోష్ పరిశీలించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలని సూచించారు. మండలంలోని అధికారులు సైతం పర్యవేక్షించి సమస్యలు లేకుండా చూడాలని చెప్పారు. ఎంపీడీవో అజార్‌మొహియుద్దీన్, పంచాయతీ కార్యదర్శి రమేశ్ ఉన్నారు.



ఇటిక్యాలలో గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించిన
కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ పాండే



శ్రీశైలం ప్రాజెక్టు ప్లంజ్ పూల్‌కు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ పాండే బృందం

- బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి ప్రాజెక్టు సందర్శన
- ప్రాజెక్టు స్థితిగతులపై ఆరా
- కుడి, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాల పరిశీలన

బ్రహ్మగిరి, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): కేఆర్ఎంబీ (కృష్ణ రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు) చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బీపీ పాండే బుధవారం మెదటి సారిగా శ్రీశైలం ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు స్థితిగతులపై సీఈ కబీర్‌భాషను అడిగి తెలుసుకున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు వచ్చే వరదనీరు, గ్యాలరీ, ప్లంజ్‌పూల్‌ను జలవిద్యుత్ కేంద్రాలలో జరిగే విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పరిశీలించారు. ప్రాజెక్టు క్రస్టుగేట్ల మరమ్మతులపై చర్చించారు.

ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం పరిశీలన

శ్రీశైలం ఎమమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రాన్ని కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ పాండే, సభ్యుడు కేకే జాన్వీడ్, శ్రీశైలం డ్యాం నిర్వాహణ అధికారులతో కలిసి పరిశీలించారు. భూగర్భంలో ఇంతటి అద్భుతమైన విద్యుత్ కేంద్రం ఉండటం గర్వించదగ్గ విషయని పాండే అన్నారు. అంతకుముందు జెన్‌కో సీఈ కేవీవీ సత్యనారాయణ వారికి స్వాగతం పలికారు. కార్యక్ర మంలో ఎస్ఈలు ఆదిరారాయణ, రవీంద్రకుమార్, డ్యాం ఈఈ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మత్స్యకారుల సంక్షేమం కోసం సీఎం కృషి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- మార్లబీడులో మత్స్యకారుల సబ్సిడీ వాహనం ప్రారంభం



చేపల విక్రయ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా మహిళా సమాఖ్య సభ్యురాలు, ధరూర్ మండలం మార్లబీడు గ్రామానికి చెందిన వాకిటి సుప్రియ ఇందిరా మహిళాశక్తి, పీఎంఎంఎస్‌వై పథకానికి ఎంపికయ్యారు. ఆమెకు సబ్సిడీపై మంజూరైన మత్స్యకారుల వాహనాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఆహర్నిశలు కృషి చేస్తున్నదని అన్నారు. ఇందిరా మహిళాశక్తి, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. నూతన చాపల విక్రయ వాహనాన్ని ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాలైన సౌకర్యాలతో జనం ఎక్కువగా ఉండే ప్రదేశంలో ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ధరూర్ మండల మహిళా సంఘం అధ్యక్షురాలు సంగీత, నాయకులు శ్రీరాముల ఉన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిన వరద

- 1.82 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

'సంగంబండ' గేటు మూసివేత

6

చేపల వేటకు వెళ్లి భార్యాభర్తల గల్లంతు

- రెండు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల గాలింపు



రాముడు(ఫైల్)



సంధ్య(ఫైల్)




పిల్లలను ఓదార్చుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, ఎస్పీ శ్రీనివాస్‌రావు

గద్వాల/మల్దకల్, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం తాటికుంట రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లిన భార్యాభర్తలు గల్లంతు అయ్యారు. తాటికుంట గ్రామానికి చెందిన బోయ దుబ్బోనిబాయి రాముడు (37), భార్య సంధ్య(33)లు ఉన్న కొద్దిపాటి భూమి రిజర్వాయర్‌లో పోవడంతో వారు చేపల వృత్తిని ఎంచుకొన్నారు. మంగళవారం సాయంత్రం రిజర్వాయర్‌లో వల వేయడానికి వారిద్దరూ పుట్టిలో వెళ్లారు. వల వేసే క్రమంలో ప్రమాదవశాత్తు రిజర్వాయర్‌లో పడిపోయారు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు రిజర్వాయర్ దగ్గరికి రాగా వారి మోటార్ బైక్, చెప్పులను గుర్తించారు. దీంతో వెంటనే రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. తెల్లారేలోపే రెండు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు రిజర్వాయర్‌లోకి దిగాయి. వారితో పాటు గజ ఈతగాళ్లు దిగారు. కానీ బుధవారం సాయంత్రం వరకు వారి ఆచూకీ లభ్యం కాలేదు. ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ ఎప్పటికప్పుడు అధికారులతో పర్యవేక్షించారు. మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ కూడా సంఘటనపై ఆరా తీశారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ మొగులయ్యలు స్వయంగా ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో రిజర్వాయర్‌లోకి వెళ్లి పరిశీలించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

తల్లి కోసం తల్లడిల్లుతున్న పిల్లలు


తల్లిదండ్రులు రాముడు, సంధ్య ఇంటికి రాకపోవడంతో వారి చిన్నారులు చైతన్య, లక్కి తల్లడిల్లుతున్నారు. అమ్మనాన్న కావాలంటూ ఏడుస్తున్నారు. కుటుంబ సభ్యుల రోదనలు కూడా అందరినీ కలిచివేశాయి. గ్రామంలో తీవ్ర విషాదం నిండుకున్నది.



వనపర్తి జిల్లా కేంద్రంలోని గ్రీన్ పార్కు వద్ద కొలువైన భారీ ఘణనాథుడు



వనపర్తి పట్టణంలోని కేడీఆర్ నగర్, రామ్ సేన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన త్రిశూలధారి గణపతి



నారాయణపేటలోని కొండారెడ్డి దేవాలయం వద్ద బొజ్జగణపయ్య



కొత్తకోట రచ్చకట్ట గణేష్ నగర్ కాలనీలో కొలువైన విఘ్నేశ్వరుడు

విఘ్నాలు తొలగించు విఘ్నేశా



గద్వాల పట్టణంలోని భీమ్‌నగర్‌లో ఆకార్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 22 అడుగుల వినాయక విగ్రహం

విఘ్నాలు తొలగించు విఘ్నేశా.. అని భక్తులు నిత్య పూజలు చేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా గణేష్ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఊరూరా వివిధ ఆకృతుల్లో కొలువు దీరిన వినాయకుడిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పిస్తున్నారు. మండపాల వద్ద సాయంత్రం వేళ భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి నెలకొంటున్నది.

- మహబూబ్‌నగర్ న్యూటౌన్, నారాయణపేట న్యూటౌన్, గద్వాల సర్కిల్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి



గద్వాల జోహ్వేశ్వర కల్యాణ మండపంలో జ్యోతిర్లింగాలకు ప్రదక్షిణ చేస్తున్న గణనాథుడు



పాలమూరులోని రామయ్యబౌలిలో పూజలందుకుంటున్న గణపతి

ప్రతీ ఇంట్లో ఒక ఎల్ఐసీ పాలసీ

- పైలట్ ప్రాజెక్ట్‌గా కేశంపేట మండలం
- ప్రజలకు బీమా, గ్రామాభివృద్ధికి నిధులు
- క్లియా ఈడీ పీసీ పైక్రే వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న క్లియా ఈడీ పీసీ పైక్రే

షాద్‌నగర్ అర్బన్/జడ్చర్ల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారతీయ జీవిత బీమా సంస్థ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయబోతున్న ప్రతీ ఇంట్లో ఒక ఎల్ఐసీ పాలసీ కోసం పైలెట్ ప్రాజెక్ట్‌గా షాద్‌నగర్ నియోజక వర్గంలోని కేశంపేట మండలాన్ని ఎంపిక చేసిందని క్లియా ఈడీ పీసీ పైక్రే వెల్లడించారు. ఎల్ఐసీ జడ్చర్ల, షాద్‌నగర్ శాటిలైట్‌శాఖ పరిధిలో పనిచేస్తున్న అభివృద్ధి అధికారులు, క్లియా, ఏజెంట్లు, బీమా సఖీల సమావేశాన్ని బుధవారం జడ్చర్ల ఆఫీసులో నిర్వహించారు. సమావేశానికి హాజరైన పైక్రే మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న ఎనిమిది ఎల్ఐసీ జోన్లలో 16 ప్రాంతాలను పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకుందని వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల్లోనే కేశంపేటను ఏకైక మండలంగా ఎంపిక చేసిందని తెలిపారు. 2026 మార్చి 31 నాటికి కేశంపేట మండలంలోని 29 గ్రామ పంచాయతీలలో గల ప్రతి ఇంటికి కనీసం ఒక పాలసీ ఇచ్చి, బీమా గ్రామాలుగా, బీమా పాఠశాలలుగా ఎంపిక చేయాలని సూచించారు. బీమా గ్రామాలకు 30వేల నుంచి లక్ష రూపాయలను, బీమా పాఠశాలకు పది వేల నుంచి లక్ష రూపాయలను ఎల్ఐసీ ఇస్తుందని వెల్లడించారు.

ఎల్ఐసీ జోనల్ మేనేజర్ పునీత్‌కుమార్ మాట్లాడుతూ 2047 నాటికి భారత దేశంలోని ప్రతీ వ్యక్తికి బీమా రక్షణ కల్పించాలన్న లక్ష్యంతో కేశంపేట మండలాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేశారని తెలిపారు. అవసరమైన గ్రామాల్లో బీమా సఖీలను నియమించి, ఇంటింటికి కనీసం ఒక పాలసీని ఇచ్చి ఎల్ఐసీ తీసుకున్న నిర్ణయాన్ని విజయవంతం చేయాలని కోరారు. క్లియా ఆర్ఎం రాజశేఖర్ మాట్లాడుతూ కేశంపేట మండలానికి దక్కిన అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్లియా మేనేజర్ రవిశంకర్ అధ్యక్షతన జరిగిన సమాశానికి సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్ ప్రసాద్‌రావు, కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, బీఎస్ బీడీ జగన్నాథ్, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ శంకర్, బ్రాంచ్ మేనేజర్ ఫణిభూషన్, ఏబీఎం రవీంద్రనాయక్, డీవోలు, క్లియాలు, ఏజెంట్లు హాజరయ్యారు.

పాలమూరు పరిధిలో రైల్వే సమస్యలు పరిష్కరించాలి

- రైల్వే అధికారుల సమావేశంలో ఎంపీ డీకే అరుణ



సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్/ నారాయణపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో, పాలమూరు పార్లమెంట్ పరిధిలో ప్రధానంగా ఉన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ రైల్వే అధికారులకు సూచించారు. సికింద్రాబాద్‌లోని రైల్వే నిలయంలో బుధవారం అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సూచించిన సమస్యల పరిష్కారానికి రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించినట్లు ఆమె పేర్కొన్నారు. కృష్ణా - వికారాబాద్ రైల్వే లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. దేవరకద్రలో ఆర్‌యూబీ కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని, పురోగతి ఎమిటని, త్వరగా పూర్తి చేయాలన్నారు. గద్వాల - డోర్నకల్ రైల్వేస్టేషన్ పురోగతి ఏమిటని అధికారులను అడగగా, డీపీఆర్ బోర్డు పరిశీలనలో ఉందని తెలిపారు. మహబూబ్‌నగర్ నుంచి కర్నూల్ వెళ్లడానికి మధ్యాహ్నం తర్వాత కొత్త రైలు వేయాలని ఆమె కోరారు. డబ్లింగ్ పనులు అవుతున్నందు వల్ల సాధ్యపడడం లేదని అధికారులు వివరించారు. గద్వాలలో వందేభారత్ ట్రైన్ ఆపాలని కోరారు. ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించి త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు.

సమావేశంలో ఎంపీ డీకే అరుణతో పాటు తెలుగు రాష్ట్రాల ఎంపీలు, సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ విలువలను దిగజారుస్తున్న 'మర్రి'

- అవినీతి ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమా
- మర్రి జనార్దన్‌రెడ్డికి ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి సవాల్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి రాజకీయ విలువలను దిగజారుస్తున్నారని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మంగళవారం నిర్వహించిన ధర్నాలో తనను, తన కుమారుడు ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిని ఉద్దేశించి మర్రి జనార్దన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తన నివాసంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని, తన కుటుంబం ఏనాడూ అవినీతిని పెంచి పోషించలేదన్నారు. పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా ఉన్న మర్రి జనార్దన్‌రెడ్డి పాల్పడిన అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ఇటీవల ఎమ్మెల్యే అయిన రాజేశ్‌రెడ్డిని చూసి మర్రి జనార్దన్‌రెడ్డి ఎందుకు జీర్ణించుకోలేకపోతున్నాడని ప్రశ్నించారు. నోటికి ఎంత వస్తే అంత మాట్లాడితే సహించేది లేదన్నారు. తాను నోరు విప్పి నిజాలు చెబితే మర్రిజనార్దన్‌రెడ్డి నియోజకవర్గంలో తిరిగే పరిస్థితి కూడా ఉండదని కూచకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. తండ్రి, కొడుకులు ఒకరికొకరు అండగా ఉండాలా, లేదా బ్రోకర్ల పక్షాన నిలవాలా అనే అంశంపై మర్రి జనార్దన్‌రెడ్డి స్పష్టతనివ్వాలని సూచించారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ చైర్మన్ రమణారావు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హబీబ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటయ్య, నాయకులు కావలి శ్రీను, తీగల సునేంద్ర, ఎండీ నిజాం, వనపట్ల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా సీవోఈ ప్రవేశాలకు పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎండబ్ల్యూ శంకరాచారి

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ తెలంగాణ మైనార్టీ గురుకులాల కళాశాలల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) ప్రవేశాలకు జిల్లా బుధవారం కేంద్రంలోని రాజేంద్రనగర్‌లో గల మైనార్టీ బాలికల జూనియర్ కళాశాలలో పరీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాన్ని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శంకరచారి, ఉమ్మడి జిల్లా మైనారిటీ గురుకులాల రీ జినల్ లెవెల్ కోఆర్డినేటర్ ఖాజా బహోద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు ఎంపీసీ, బైపీ సీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యా ర్థులు ప్రవేశ పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. బాలుర విభాగంలో 159 మందికి గాను 122, బాలికల విభాగంలో 131 మందికి గాను 114 విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

రూ.1.32 లక్షలు పలికిన లడ్డూ వేలం పాట



వేలంపాటలో లడ్డూను దక్కించుకున్న మల్లేశ్‌ను ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్తున్న వ్యాపారసంఘం నాయకులు

మిడ్జిల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలోని వ్యాపారసంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన విగ్నేశ్వరుని నిమజ్జన కార్యక్రమాన్ని బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వ్యాపారసంఘం అధ్యక్షుడు గంజి కృష్ణ, ఉత్సవకమిటీ అధ్యక్షుడు మిడిదొడ్డి విజయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాటను నిర్వహించారు. పాల్గొన్న పలువురు లడ్డూను దక్కించుకునేందుకు పోటీపడగా, చివరకు మిడ్జిల్ గ్రామానికి చెందిన ఎడ్ల మల్లేష్ రూ.లక్షా ముప్పై రెండువేలకు దక్కించుకున్నారు. మల్లేష్ దంపతులను లడ్డూ ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం వినాయకుని నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యాపారసంఘం నాయకులు, మహిళలు కోలటాలతో పాటు పలు సంస్కృతిక నృత్యాలతో వినాయకుని ఊరేగింపు నిర్వహించారు. ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక అందించాలి

- నదిలోంచి ఇసుక తీయడంలో వేగం పెంచాలి
- తుమ్మిళ్ల ఇసుక రీచ్‌ను పరిశీలించిన టీజీఎండీసీ ఎండీ భవేష్ మిశ్రా (ఐఏఎస్)

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజోలి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక సరఫరా చేయడంలో ఆల స్యం చేయకుండా అందించాలని టీజీఎండీసీ ఎండీ భవేష్ మిశ్రా అన్నారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి' లో వచ్చిన "ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కష్టాలు" అనే కథనానికి ఆయన స్పందించారు. బుధ వారం ఇసుక సరఫరాల చేస్తున్న రాజోలి మండలంలోని తుమ్మిళ్ల గ్రామం శివారులోని తుంగభద్ర నది ఒడ్డున ఏర్పాటు చేసిన టీజీ ఎండీసీ ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ... లబ్ధిదారుల కు ఇసుక అందించడంలో ఎందుకు ఆలస్యం అవుతున్నదని సంబంధిత అధికారులను ప్ర శ్నించారు. నదిలోంచి ఇసుక తీయడం, లబ్ధిదారులకు ఇసుక సరఫరా చేయడంలో వస్తున్న సమస్యలను, ఇప్పటి వరకు తీసిన ఇసుక వి వరాలను ఆయన అధికారులను, కాంట్రాక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. నదిలో పైనుంచి 80 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో ఇసుక తీయడం నిలిపివేశామని, వర ద ప్రవాహం తగ్గగానే బోట్ ద్వారా ఇసుక తీ స్తామని కాంట్రాక్టర్ ప్రసాద్ బాబు తెలిపారు. రోజుకు 80 మెట్రిక్ టన్నుల చొప్పున ఇప్పటి వరకు 17 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను తీసి డంప్ చేశామని ఆయన తెలిపారు. ఇందిర మ్మ ఇళ్లకు కావాల్సింది 8 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం ఉందని, అయితే ఇసుక తరలించేందుకు అనుగుణంగా ఉన్న రహదారిలో కొన్ని అడ్డంకులు ఉన్నాయని, అందువల్లే ఆలస్యమవుతున్నదని జిల్లా మైనింగ్ ఏడీ వెంకటరమణ తెలిపారు. కలెక్టర్‌తో మాట్లాడి అడ్డంకులను తొలగించి, సమస్య పరిష్కారం అయ్యేవిధంగా చూస్తానన్నారు. కార్యక్రమంలో సౌట్ ఇన్‌చార్జి చైతన్య, రాజోలి తహసీల్దార్ రామ్మోహన్, శాంతినగర్ సీఐ టాటాబాబు, రాజోలి ఎస్ఐ గోకారి పాల్గొన్నారు.

జోగులాంబ ఆలయాల దర్శనం

అలంపూర్: జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారిని జోగుళాంబ తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఐ ఏఎస్ భవిష్ మిశ్రా ఉభయ ఆలయాలను బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిన వరద

- 1.82 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గద్వాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతోంది. బుధవారం ప్రాజెక్టులోకి 1.82 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. గేట్లను మూసివేసి కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 66,568 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 205.66 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 59 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 50 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 52 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో 45 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నది. సన్నతి బ్యారేజీ అవుట్‌ఫ్లో 40 వేల క్యూసెక్కులు జూరాలకు వస్తుంది. ప్రస్తుతం జూరాలకు 1.02 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 10 గేట్లను ఎత్తి 66,776 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 38,225 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి సుంకేసులకు 80 వేలు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో 76 వేల క్యూసెక్కులను శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

'సంగంబండ' గేటు మూసివేత

మక్తల్ రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయం గేటును ఇరిగేషన్ అధికారులు బుధవారం మూసివేశారు. ఎగువ నుంచి పెద్ద వాగుకు వరద ఉధృతి తగ్గడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. రిజర్వాయర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.6 టీఎంసీ నీరు నిల్వ ఉందని డీఈఈ సురేశ్ తెలిపారు.

చదువు, సాగునీరు ఇదే ఎజెండా

(5వ పేజీ తరువాయి)

మంజూరు చేస్తున్నామని చెప్పారు. పాలమూరులో ట్రిపుల్ ఐటీ కాలేజీ మంజూరు చేశామని, అద్భుతమైన క్యాంపస్ త్వరలో రూపుదిద్దుకుంటుందని అన్నారు. 14 నియోజకవర్గాలకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు మంజూరు చేశామని, 25 ఎకరాల విస్తీర్ణంలో రూ. 2,800 కోట్లతో వాటిని నిర్మించబోతున్నామని తెలిపారు. బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అయ్యారని, ఆ తర్వాత 75 ఏళ్లకు పాలమూరు బిడ్డకు సీఎం అవకాశం వచ్చిందన్నారు. ఈ అవకాశం తప్పితే మరో 75 ఏళ్లవుతుందన్నారు. ఇందిరా గాంధీ హయాంలో వేలాది ఎకరాలను భూస్వాముల నుంచి తీసుకుని.. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అసైన్డ్ భూములుగా పంచారన్నారు. కొంతమంది వాటినిఇ సద్వినియోగం చేసుకుంటే.. కొందరు నీరు లేక సద్వినియోగం చేసుకోలేకపోయారని తెలిపారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని, విద్యకు నిధుల కొరత లేదన్నారు.

ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయలేదని, ప్రస్తుతం గ్రీన్ ఛానల్ ద్వారా ప్రాజెక్టులకు నిధులు ఇస్తున్నామని సీఎం తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం కోసం జీవో నెంబర్ 69ను జారీ చేయించామని, కానీ పదేళ్ల దాన్ని తొక్కిపెట్టి అన్యాయం చేశారని అన్నారు. ప్రస్తుతం రూ.4 వేల కోట్లతో టెండర్లు పిలుచుకుని, భూసేకరణ చేస్తుంటే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు వేసి.. అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. భూసేకరణకు సంబంధించి వివాదాలు వస్తున్నాయని, మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కలెక్టర్ క్షేత్రస్థాయిలో రైతులను ఒప్పించాలని సూచించారు. రైతులు తమ దగ్గరికి రావడం కాదని, రైతుల దగ్గరకే వెళ్లి వారికి ఏం కావాలో తెలుసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎకరాకు రూ.11 లక్షల కంటే పరిహారం ఎక్కువగా ఎక్కడా ఇవ్వలేదని, ఇక్కడ రూ.14 లక్షల పరిహారం ఇస్తున్నామన్నారు. మంత్రి, ఎమ్మెల్యే రైతులతో మాట్లాడి.. చెబితే న్యాయమైన పరిహారం ఇద్దామని అన్నారు. కోస్గిలో పట్టణానికి దగ్గరగా ఉండి, రియల్ ఎస్టేట్ విలువ ఎక్కువగా ఉండటం వల్ల రూ.20 లక్షల పరిహారం ఇస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు ఇప్పుడు పూర్తి చేసుకోకుంటే ఇబ్బంది అవుతుందని అన్నారు. గతంలో నాయకత్వ లోపం, నిధుల అలసత్వంతో పాలమూరు వెనుకబడిందన్నారు. ఇప్పుడు మన జిల్లాకు.. మనం చేసుకునే మేలు అభివృద్ధి చేయడమేనన్నారు. గతంలో టోనీ బ్లేయర్, ఇతర విదేశీ వ్యక్తులు వస్తే పాలమూరు కరువును ఎగ్జిబిషన్‌గా చూపించారని, ప్రతీవాడు దత్తత తీసుకుంటానని చెప్పినా అభివృద్ధి జరగలేదన్నారు.



సమావేశానికి హాజరైన కార్యకర్తలు, నాయకులు

ఇండిస్ట్రియల్ కారిడార్ మంజూరు చేయండి : మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర నియోజకవర్గంలో 44వ జాతీయ రహదారి 68 కిలోమీటర్ల మేర ఉందని, ఈ రహదారి వెంట ఇండస్ట్రియల్ కారిడార్ మంజూరు చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పరిశ్రమలకు ప్రోత్సాహం ఇస్తున్నామని, కార్నింగ్ పరిశ్రమలో కూడా స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరితే వారు ఒప్పుకున్నారని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గం విద్య, వైద్యంలో వెనుకబడిందని అన్నారు. ప్రస్తుతం దేవరకద్రకు డిగ్రీ కాలేజీ మంజూరైందని, కోర్టు వచ్చిందని, రూ.110 కోట్లతో కురుమూర్తి ఆలయానికి ఎలివేటెడ్ ఘాట్ రోడ్డు మంజూరై.. పనులు నడుస్తున్నాయని చెప్పారు. వచ్చే బ్రహోత్సవాల నాటికి ఆ పనులు పూర్తి చేయిస్తామని అన్నారు. ఇప్పటికే బ్రహ్మోస్ మిసైల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు పరిశీలన జరిగి.. సూత్రప్రాయమైన అంగీకారం వచ్చిందని చెప్పారు. రూ.300 కోట్ల విలువైన భూములను ఇవ్వనున్నట్లు తెలిపారు. లా, ఇంజనీరింగ్, ట్రిపుల్ ఐటీ, ఏటీసీలు జిల్లాకు మంజూరయ్యాయని అన్నారు. దేవరకద్రలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ మంజూరు చేయాలని, దేవరకద్ర కొత్త మునిసిపాలిటీకి రూ.30 కోట్లు ఇవ్వాలని, కొత్తకోటకు డిగ్రీ కాలేజీ ఇవ్వాలని, నియోజకవర్గంలోని పీహెచ్‌సీలను సీహెచ్‌సీలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. జాతీయ రహదారి ఉన్నందున రోడ్డు ప్రమాద బాధితులకు చికిత్స అందించేందుకు ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఇప్పటికే దేవరకద్రకు వంద పడకల ఆస్పత్రి, కొత్తకోటకు 30 పడకల ఆస్పత్రి మంజూరైందని, పనులు ప్రారంభించామని తెలిపారు.

మన్‌దీప్ గోల్‌తో గట్టెక్కింది!

కొరియాతో భారత్ మ్యాచ్ డ్రా
ఆసియా కప్ హాకీ


రాజ్‌గిర్ (బిహార్): ఆట ముగిసేందుకు మరో ఎనిమిది నిమిషాలే ఉంది. స్కోరు చూస్తే భారత్ 1-2తో కొరియాతో సూపర్ ఫోర్ తొలి మ్యాచ్‌లో వెనుకంజలో ఉంది. దాంతో ఆసియా కప్ హాకీ టోర్నీలో ఆతిథ్య భారత్‌కు తొలి పరాజయం తప్పదేమో అనిపించింది. కానీ ఈ దశలో ఫార్వర్డ్ మన్‌దీప్ సింగ్ మాయ చేశాడు. లెఫ్ట్ ఫ్లాంక్ నుంచి హర్మన్‌ప్రీత్ అందించిన రివర్స్ పాస్‌ను సుఖ్‌జీత్ సింగ్..మన్‌దీప్ వైపు కొట్టాడు. బంతిని అందుకున్న మన్‌దీప్ నలుగురు కొరియా డిఫెండర్లను బోల్తాకొట్టిస్తూ గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. అంతే.. స్కోరు 2-2తో సమం. భారత ఫ్యాన్స్‌లో ఆనందం. సూపర్-4లో భాగంగా కొరియాతో బుధవారం జరిగిన మ్యాచ్‌ను భారత్ డ్రా చేసింది. దాంతో టోర్నమెంట్‌లో అపజయమెరుగని రికార్డును ఆతిథ్య జట్టు కొనసాగించింది. ఎనిమిదో నిమిషంలోనే హార్దిక్ సింగ్ గోల్ చేసి భారత్‌ను ఆధిక్యంలో నిలిపాడు. యాంగ్ జిహున్ (12) గోల్‌తో స్కోరు సమం చేసిన కొరియా..కొద్ది సేపటికే కిమ్ (14) సాధించిన గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లింది. డ్రా దరిమిలా రెండు జట్లు చెరో పాయింట్ దక్కించుకున్నాయి. మరో సూపర్ ఫోర్ పోరులో మలేసియా 2-0తో చైనాను చిత్తు చేసింది. ఇక గురువారం జరిగే సూపర్-4 రెండో మ్యాచ్‌లో మలేసియాను భారత్ ఢీకొంటుంది.



మన్‌దీప్ సింగ్

జొకో.. జోరు

యూఎస్ ఓపెన్



సెమీస్‌కు నొవాక్, సబలెంక



సబలెంక

న్యూయార్క్: 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్, మహిళల డిఫెండింగ్ చాంప్ అరియానా సబలెంక యూఎస్ ఓపెన్ సెమీస్‌కు దూసుకెళ్లారు. గతేడాది రన్నరప్, లోకల్ స్టార్ టేలర్ ఫ్రిట్జ్‌తో ముఖాముఖి పోరులో ఏడో సీడ్ జొకో తన రికార్డును 11-0తో మరింతగా మెరుగుపర్చుకొన్నాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో జొకో 6-3, 7-5, 3-6, 6-4తో నాలుగో సీడ్ ఫ్రిట్జ్‌పై సునాయాసంగా గెలిచాడు. ఈ క్రమంలో 53వసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్ చేరిన నొవాక్.. అమెరికా లెజెండ్ క్రిస్ ఎవర్ట్ 52సార్లు సెమీస్ చేరిన రికార్డును బద్దలుకొట్టాడు. సెమీస్‌లో అల్కారజ్‌తో జొకో అమీతుమీ తేల్చుకోనున్నాడు. తొలి సెట్‌లో నొవాక్ అలవోకగా నెగ్గినా.. రెండో సెట్‌లో ఫ్రిట్జ్ నుంచి పోటీ ఎదురైంది. అయితే, 5-5 వద్ద తనదైన దూకుడు ప్రదర్శించిన నొవాక్ సెట్‌ను సొంతం చేసుకొని 2-0 ఆధిక్యంలోకి వెళ్లాడు. కానీ, మూడో సెట్‌లో ఫ్రిట్జ్ పోరాడి గెలిచినా.. ఆ తర్వాతి సెట్‌లో జొకో జోరు ముందు నిలవలేక పోయాడు. 2003లో చివరిసారి అమెరికా ఆటగాడు ఆండీ రాడిక్ న్యూయార్క్‌లో టైటిల్ నెగ్గాడు. ఈసారి ఫ్రిట్జ్ ఆ లోటు తీరుస్తాడను కొంటే.. జొకో అడ్డుపడ్డాడు. కాగా, టాప్‌సీడ్ సబలెంకకు క్వార్టర్స్‌లో వాకోవర్ లభించింది. ప్రత్యర్థి మార్కెటా వొండ్రుసోవా (చెక్) ప్రాక్టీస్ చేస్తుండగా మోకాలికి గాయమైంది. దీంతో ఆమె బరిలోకి దిగలేక పోయింది. శుక్రవారం జరిగే సెమీస్‌లో గతేడాది ఫైనలిస్ట్ పెగులతో స బలెంక తలపడనుంది.

భాంబ్రి తొలిసారి..: యుకీ భాంబ్రి కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో భాంబ్రి-మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జంట 6-4, 6-4తో జర్మనీకి చెందిన కెవిన్ క్రవీట్జ్-టిమ్ ప్యూట్జ్‌పై గెలిచింది.

నొవాక్ 'సోడా పాప్' సంబరాలు


మ్యాచ్ గెలిచిన తర్వాత జొకోవిచ్ 'కె-పాప్ డీమన్ హంటర్స్' సినిమాలోని 'సోడా పాప్' పాట డ్యాన్స్‌తో సంబరాలు చేసుకొన్నాడు. జొకో కుమార్తె తారకు 'కె-పాప్ డీమన్ హంటర్స్' అంటే ఎంతో ఇష్టం. కాగా, తార పుట్టిన రోజు కావడంతో.. ఆ డ్యాన్స్ మూమెంట్స్ ద్వారా కుమార్తెకు జొకో శుభాకాంక్షలు తెలిపాడు.

సినర్‌పై రూ. 2.64 కోట్ల పందెం

ఈ ఏడాది యూఎస్ ఓపెన్ టైటిల్‌ను డిఫెండింగ్ చాంప్ యానిక్ సినర్ నిలబెట్టుకొంటాడని కెనడా ర్యాపర్, సింగర్ డ్రేక్ భారీగా బెట్టింగ్ పెట్టాడు. ఇటలీ టాప్ సీడ్ ప్లేయర్‌పై డ్రేక్ రూ. 2.64 కోట్లు పందెం కాశాడు. ఒకవేళ సినర్ విజయం సాధిస్తే.. డ్రేక్‌కు రూ. 4.46 కోట్లు దక్కనున్నాయి.

నిఖత్‌పై అందరి దృష్టి!

నేటినుంచి ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్



లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రతిష్ఠాత్మక వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్ గురువారం ఇక్కడ ఆరంభం కానున్నాయి. ప్రపంచ బాక్సింగ్ కొత్త పాలక మండలి..'వరల్డ్ బాక్సింగ్' ఆధ్వర్యంలో తొలిసారి ఈ పోటీలు జరగనున్నాయి. ఈ చాంపియన్‌షిప్స్‌ను పురుషులు, మహిళల విభాగాలలో కలిపి ఒకేసారి నిర్వహిస్తుండడం విశేషం. ఇక..భారత్‌కు సంబంధించిన తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గొహైన్‌పై అందరి దృష్టి నిలిచింది. రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ వరుసగా మూడో వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో మూడు వేర్వేరు బరువు విభాగాలలో తలపడుతుండడం గమనార్హం. 2022లో 52కి. విభాగంలో విశ్వవిజేతగా నిలిచిన నిఖత్.. 2023లో 50కి. కేటగిరీలో టైటిల్ దక్కించుకుంది. ఇక ఈసారి 51 కి. విభాగంలో తలపడుతోంది. మారిన బరువు విభాగంలో నిఖత్ ఎలా రాణిస్తుందన్నది ఆసక్తికరం. పారిస్ ఒలింపిక్స్‌లో రెండో రౌండ్‌లోనే ఓటమి చవిచూసిన జరీన్.. ఏడాది తర్వాత అంతర్జాతీయ పోటీల బరిలో దిగుతోంది. పారిస్ క్రీడల తర్వాత నిఖత్‌తో పాటు లవ్లీనా ఒక దేశవాళీ ఈవెంట్‌లో మాత్రమే పాల్గొన్నారు. ఇద్దరికీ తొలి రౌండ్లలో కఠిన ప్రత్యర్థులు ఎదురు కానున్నారు. 65 దేశాల నుంచి 550మంది బాక్సర్లు ఈ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో తలపడుతున్నారు. భారత్ నుంచి పురుషుల, మహిళల విభాగాల్లో చెరి పదేసి మంది బాక్సర్లు పోటీపడుతున్నారు.

రోహిత్, గిల్ అండ్ కోకు 'బ్రాంకో టెస్ట్' లేనట్టే..



న్యూఢిల్లీ: భారత జట్టు ఆటగాళ్లకు బీసీసీఐ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ)లో ఫిట్‌నెస్ టెస్ట్‌లు నిర్వహిస్తూంటుంది.. ఇది రొటీన్‌గానే జరిగేదే అయినా.. సరికొత్తగా 'బ్రాంకో' టెస్ట్‌ను ప్రవేశపెడుతున్నారని కొద్ది రోజుల క్రితం వచ్చిన వార్త కారణంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. రగ్బీ ఆటగాళ్లకు నిర్వహించే ఈ కఠిన పరీక్షను రోహిత్ శర్మను బయటకు పంపేందుకే ప్రవేశపెడుతున్నారంటూ విమర్శలు కూడా వినవచ్చాయి. తాజా సీజన్ నేపథ్యంలో రోహిత్, శుభ్‌మన్ గిల్, బుమ్రా సహా మరికొందరు కాంట్రాక్ట్ ప్లేయర్లు సీవోఈలో ఫిట్‌నెస్ పరీక్షకు హాజరయ్యారు. అయితే, వీరెవరికీ బ్రాంకో టెస్ట్ నిర్వహించలేదని తెలుస్తోంది. ఈ నూతన టెస్ట్‌ను ఇంకా ఫిట్‌నెస్ పరీక్షల్లో భాగం చేయలేదట. అందుకే పాతపద్ధతిలో యో-యో టెస్ట్ ద్వారానే ఫిట్‌నెస్‌ను పరీక్షించిందట. పైగా బోర్డు కూడా బ్రాంకో టెస్ట్‌ను ప్రవేశపెడుతున్నట్టు అధికారికంగా కూడా ప్రకటించలేదు.

బెంగాల్‌పై పుణెరి గెలుపు



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్-12 తొలి అంచెలో భాగంగా బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 45-36 స్కోరుతో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. ఆట ప్రారంభం నుంచి పల్టన్ ఆటగాళ్లు దూకుడుగా ఆడి వారియర్స్‌పై ఒత్తిడి పెంచారు. ప్రథమార్ధం 26-22 స్కోరుతో ముగిసింది. ద్వితీయార్ధంలో పుంజుకునేందుకు యత్నించిన బెంగాల్ వారియర్స్‌ను పుణెరి డిఫెండర్లు నిలువరించారు. వారియర్స్ కెప్టెన్, స్టార్ రైడర్ దేవంక్ పలుమార్లు ప్రత్యర్థి డిఫెండర్లకు చిక్కడంతో మ్యాచ్‌పై పట్టు కోల్పోయారు. పుణెరి జట్టులో అస్లాం ఇనాందార్, ఆదిత్య షిండే చెరో 11 పాయింట్లు సాధించారు. హరియాణా స్టీలర్స్-యు ముంబా జట్ల మ్యాచ్ 36-36తో టైగా ముగిసింది. అయితే షూటౌట్‌లో హరియాణా విజయం సాధించింది.

శ్రీలంకదే తొలి టీ20

హరారే: జింబాబ్వేతో తొలి టీ20లో శ్రీలంక గెలుపొందింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 175/7 చేసింది. దుష్మంత చమీర 3 వికెట్లు తీశాడు. ఛేదనలో శ్రీలంక 19.1 ఓవర్లలో 177/6 స్కోరు చేసి గెలుపొందింది. నిస్సాంక (55), కమిందు మెండిస్ (41 నాటౌట్) రాణించారు.

కబడ్డీ విజేత జోగులాంబ లయన్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): యువ తెలంగాణ కబడ్డీ లీగ్ ట్రోఫీని జోగులాంబ లయన్స్ జట్టు కైవసం చేసుకుంది. బుధవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో లయన్స్ 35-21 స్కోరుతో భద్రాద్రి బ్రేవ్స్ జట్టుపై నెగ్గింది. లీగ్ ఉత్తమ రైడర్‌గా జి.రాజు, డిఫెండర్‌గా నవీన్, ఆల్‌రౌండర్‌గా లక్ష్మణ్‌కు ప్రత్యేక అవార్డులు లభించాయి. ఐపీఎస్ అధికారి రాహుల్ హెగ్డే, తెలంగాణ కబడ్డీ సంఘం అధ్యక్షుడు కాసాని వీరేష్, కార్యదర్శి మహేందర్ విజేతలకు ట్రోఫీ ప్రదానం చేశారు.

తిప్పేసిన నితిన్



చెన్నై: బుచ్చిబాబు ఆలిండియా క్రికెట్ టోర్నమెంట్ రెండో సెమీ ఫైనల్లో హరియాణాను 99 పరుగులతో ఓడించి హైదరాబాద్ జట్టు ఫైనల్లో ప్రవేశించింది. బుధవారం తమ రెండో ఇన్నింగ్స్‌లో హరియాణా 272 పరుగుల లక్ష్యంతో ఛేదన ప్రారంభించగా, హైదరాబాద్ లెఫ్టార్మ్ స్పిన్నర్ నితిన్ సాయి యాదవ్ (7/44) దెబ్బకు 62.4 ఓవర్లలో 181కు ఆలౌటై పరాజయం పాలైంది. అంతకు ముందు తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 225, హరియాణా 208కు, రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 254కు ఆలౌటయ్యాయి. హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 91 పరుగులతో రాణించిన వరుణ్ గౌడ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

ఇకపై మరింత బాధ్యతగా ఉంటాం

'చిన్నస్వామి' ఘటనపై కోహ్లి



న్యూఢిల్లీ: బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో గత జూన్ నాలుగున జరిగిన తొక్కిసలాటపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి ఎట్టకేలకు స్పందించాడు. 'అది.. మా ఫ్రాంచైజీ చరిత్రలో ఓ సంతోషకరమైన ఘట్టం కావాల్సింది. కానీ విషాదంగా మారింది. ఆ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన మా అభిమానుల గురించి ఆలోచిస్తున్నా. వారి గురించి ప్రార్థిస్తున్నా. ఇకపై జాగ్రత్తగా, బాధ్యతగా, గౌరవంగా ముందుకు సాగుతాం' అని కోహ్లి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ సీజన్ ఐపీఎల్ టైటిల్‌ను ఆర్‌సీబీ గెలుచుకున్న సందర్భంగా చిన్నస్వామి స్టేడియంలో ఏర్పాటు చేసిన విజయోత్సవంలో తొక్కిసలాట జరిగి 11 మంది క్రికెట్ ఫ్యాన్స్ మరణించగా, మరో 71 మంది గాయపడ్డారు.

వృద్ధి, ఉద్యోగాల కల్పనకు ఊతం

బిజినెస్

జీఎస్‌టీ సంస్కరణలపై హర్షాతిరేకాలు



ప్రభుత్వం బుధవారం ప్రకటించిన జీఎస్‌టీ సంస్కరణలు ఆర్థిక వృద్ధికి, ఉపాధికల్పనకు ఊతం ఇచ్చేలా ఉన్నాయి. ఒక పక్క భౌగోళిక, రాజకీయ పరిస్థితుల ప్రభావంతో దేశీయ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సవాలును ఎదుర్కొంటోంది. మరోపక్క అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటు ఎగుమతుల రంగానికి తీరని కాటుగా పరిణమించింది. గత కొద్ది కాలంగా ఎగుమతుల రంగం భారీ తిరోగమనంలో ఉంది. సుంకాల ప్రభావం వల్ల రాబోయే కాలంలో ఎగుమతులు భారీగా పడిపోవచ్చునన్న భయాలు కూడా సర్వత్రా నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య దేశీయ వినియోగాన్ని గణనీయంగా పెంచుతుందని, తద్వారా ఎగుమతుల నష్టాన్ని భర్తీ చేస్తుందని విశ్లేషకులంటున్నారు. దీనికి తోడు దేశంలో పండుగల సీజన్ ప్రారంభమవుతోంది. ఈ సీజన్‌లో వస్తు సేవల వినియోగం పెరిగి ఆర్థిక వ్యవస్థ ఉత్తేజితం కావడానికి ఈ చర్య దోహదపడుతుందన్నది వారి అభిప్రాయం. దేశంలో జీఎస్‌టీ ప్రవేశపెట్టిన తర్వాత తొలి భారీ ప్రక్షాళన ఇదే. ఈ చర్యల ఫలితంగా ప్రభుత్వం పన్నుల రూపేణ ఆదాయాన్ని నష్ట పోయినా, దేశీయ వినియోగం భారీగా పెరిగి ఆర్థిక వ్యవస్థ సుంకాల పోటు నుంచి చాలా వరకు బయట పడుతుందని ఆర్థిక నిపుణుల అంచనా. దీంతో ఇప్పటి వరకు నీరసించిన ప్రైవేటు పెట్టుబడులు సైతం ఊపందుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదే జరిగితే జీడీపీ వృద్ధి రేటుకూ ఢోకా ఉండదని అంచనా. ఇప్పటివరకు ఉన్న శ్లాబ్‌లను రెండు శ్లాబ్‌లకు కుదించడం ద్వారా సగటు మనిషి వినియోగించే అనేక వస్తువులు 5 శ్లాబ్‌లోకి జారుకుని సగటు జీవికి ఉపశమనం కలుగుతుంది. దీన్ని దేవీ నవరాత్రులు, దీపావళి ముందు ప్రభుత్వం ప్రకటించిన బొనాంజాగా నిపుణులు, పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. ఈ సంస్కరణలు సగటు జీవిపైనే కాకుండా రైతాంగం, చిన్న వ్యాపారులపై కూడా భారాన్ని గణనీయంగా తగ్గిస్తాయన్నది వారి అభిప్రాయం. ఇది సగటు జీవికి అసలైన పండుగ అని ప్రభుత్వాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

స్టాక్ మార్కెట్ పరుగే

జీఎస్‌టీ నిర్ణయం గురువారం స్టాక్‌మార్కెట్‌కు పెద్ద ఉత్తేజం కావచ్చునని మార్కెట్ నిపుణులంటున్నారు. ఇటీవల కాలంలో ఈక్విటీ, ఫారెక్స్ మార్కెట్లు భారీ ఆటుపోట్లు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో మార్కెట్ తాత్కాలికంగా ఊపిరి తీసుకోవడం ఖాయమని, గురువారం మార్కెట్ సానుకూలంగా స్పందించవచ్చునని పరిశీలకులన్నారు.

పురోగామి చర్య: ఎంట్రీ లెవల్ టూ వీలర్లు, కార్లపై విధించే జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతానికి కుదించడంపై ఆటోమొబైల్ పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. 'జీఎస్‌టీ రేట్లను హేతుబద్ధం చేయాలని మేము ఎప్పటి నుంచో కోరుతున్నాం. ప్రభుత్వం ఎట్టకేలకు మా మొర ఆలకించింది' అని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని ఆయన సరైన సమయంలో తీసుకున్న పురోగామి చర్యగా అభివర్ణించారు.ఈ చర్య తప్పకుండా దేశంలో కార్ల డిమాండ్‌ను పెంచుతుందన్నారు. అన్ని రకాల ఆటోమొబైల్ విడి భాగాలను 28 శాతం జీఎస్‌టీ నుంచి 18 శాతం జీఎస్‌టీ శ్లాబులోకి మార్చడంపై ఆ కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే ఆటోమోటివ్ కంపోనెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఏసీఎంఏ) ప్రశంసించింది. ఎప్పటి నుంచో అడుగుతున్న తమ ఈ కోరికను ప్రభుత్వం ఇన్నాళ్లకు మన్నించిందని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ విన్నీ మెహతా తెలిపారు.

చిన్న కార్ల ధరలు ఎంత తగ్గొచ్చు..?

4 మీటర్లలోపు వాహనాల విభాగంలో 1200 సీసీ వరకు పెట్రోల్ కార్లపై ప్రస్తుతం 28 శాతం జీఎస్‌టీతోపాటు ఒక శాతం సెస్సు కూడా చెల్లించాల్సి ఉంటుంది. 1500 సీసీ వరకు డీజిల్ కార్లపై కేంద్రం 28 శాతం జీఎస్‌టీతోపాటు 3 శాతం సెస్సు వసూలు చేస్తోంది. ఈ విభాగ కార్లను తాజాగా 18 శాతం శ్లాబులో చేర్చారు. దీంతో చిన్న, హ్యాచ్‌బ్యాక్ మోడళ్ల ధరలు 8-10 శాతం వరకు తగ్గవచ్చని అంచనా వేసింది. మారుతి సుజుకీ చిన్న కారు ఆల్టో కే10 ఎక్స్‌షోరూమ్ ధర రూ.4..23 లక్షల నుంచి రూ.3.89 లక్షలకు తగ్గే అవకాశం ఉంది. హ్యుండయ్ హ్యాచ్ బ్యాక్ మోడల్ గ్రాండ్ ఐ10 మోడల్ రేటు రూ.5.98 లక్షల నుంచి రూ.5.51 లక్షలకు దిగిరావచ్చు. రెనో క్విడ్ ఎక్స్ షోరూమ్ ధర కూడా రూ.40,000 వరకు తగ్గవచ్చని అంచనా.

ఎగుమతిదారుల హర్షం: ఇక నుంచి వారం రోజుల్లోనే జీఎస్‌టీ రిఫండ్స్ ప్రక్రియ పూర్తి కానుంది. ఇది ఎగుమతిదారుల నిధుల కొరత సమస్యనూ తీరుస్తుందని భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1,000 వరకు ఉన్న జీఎస్‌టీ రిఫండ్‌లను అనుమతించడం ఇ-కామర్స్ ఎగుమతిదారులకు పెద్ద ఊరట అన్నారు.

ద్రవ్యోల్బణం కట్టడికి దోహదం: జీఎస్‌టీ రేట్ల తగ్గింపు వస్తు, సేవల వినియోగం భారీగా పెరగడంతోపాటు ద్రవ్యోల్బణం కట్టడి, ఆర్థిక వృద్ధి, ఉద్యోగాల కల్పనకూ ఊతమివ్వనుందని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. మరింత సరళమైన, పారదర్శకమైన, సమగ్ర పన్ను వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తాజా సంస్కరణలు దోహదపడనున్నాయని మహీంద్రా గ్రూప్ సీఈఓ, ఎండీ డాక్టర్ అనిశ్ షా అన్నారు.

రియల్టీ, మౌలిక రంగాలకు బూస్ట్: సిమెంట్, స్టీల్‌పై జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతం తగ్గించడం రియల్ ఎస్టేట్, మౌలిక రంగాల నిర్మాణ వ్యయాలను గణనీయంగా తగ్గించనుందని నరెడ్కో జాతీయ అధ్యక్షుడు, హీరానందిని గ్రూప్ ఛైర్మన్ నిరంజన్ హీరానందిని అన్నారు. ముఖ్యంగా అందుబాటు గృహ ప్రాజెక్టులకు లబ్ధి చేకూరనుందని, నిర్మాణ వ్యయం తగ్గితే కొనుగోలుదారులకు ఈ గృహాలు మరింత తక్కువ ధరకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యానికి తోడ్పాటు: 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన చేర్చాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం జీడీపీ ఏటా 7 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేయాల్సిన అవసరం ఉంది. ట్రంప్ 50 శాతం సుంకాలతో ఎగుమతి ఆధారిత రంగాల వ్యాపారంపై ప్రభావం చూపనున్న తరుణంలో జీఎస్‌టీ రేట్ల తగ్గింపు దేశీయంగా వినియోగాన్ని పెంచి వృద్ధి రేటుకు అండగా నిలవనుందని హీరానందాని అన్నారు.

బంగారం @ రూ.1.07 లక్షలు

వరుసగా 8 రోజుల్లో రూ.6,900 అప్



పసిడి సరికొత్త జీవనకాల పతాక స్థాయికి ఎగబాకింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మరో రూ.1,000 పెరిగి రూ.1,07,070కి చేరింది. 99.5% స్వచ్ఛత గల బంగారం రేటు కూడా అదే స్థాయిలో ఎగబాకి రూ.1,06,200కి చేరుకుంది. కిలో వెండి మాత్రం ఎలాంటి మార్పు లేకుండా రూ.1,26,100 పలికింది. బంగారం ధరలు పెరగడం వరుసగా ఇది ఎనిమిదో రోజు. గడిచిన 8 రోజుల్లో తులం బంగారం రూ.6,900 పెరిగింది. అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ఈ నెలలో ప్రామాణిక వడ్డీరేట్లను మరో 0.25% తగ్గించవచ్చన్న అంచనాలతోపాటు అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య అనిశ్చితులు బంగారం, వెండి ధరలకు ఆజ్యం పోస్తున్నాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర రేటు తొలిసారిగా 3,600 డాలర్ల మైలురాయిని దాటింది. ఒకదశలో 3,622 డాలర్ల వద్ద ఆల్‌టైం ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. సిల్వర్ 41.35 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. అంతర్జాతీయంగా వీటి ధరలు ముున్ముందు మరింత ఎగబాకవచ్చని బులియన్ నిపుణులు భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




4 తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	570
వరంగల్	537	గోదావరి	570
చిత్తూరు	578	విశాఖపట్నం	575
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	127
వరంగల్	98	గుంటూరు	115
కరీంనగర్	98	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	90
కర్నూలు	98	నెల్లూరు	95
విశాఖపట్నం	131	అనంతపురం	95
గోదావరి	127		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,06,970 ▲	98,050 ▲	1,37,000 ▲
విజయవాడ	1,09,000 ▲	1,03,000 ▲	1,26,700 ▲
విశాఖపట్నం	1,09,430 ▲	97,250 ▲	1,37,000 ▲
రాజమండ్రి	1,06,960 ▲	98,050 ▲	1,26,400 ▼
ప్రొద్దుటూరు	1,07,200 ▲	98,620 ▲	1,26,000 ▲
ముంబై	1,06,020 ▲	97,120 ▲	1,23,220 ▲

మారుతి కొత్త కారు విక్టోరిస్

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ ఇండియా తన స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ (ఎస్‌యూవీ) పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. ఈ విభాగంలో బ్రెజ్జా, ఫ్రాంక్స్, జిమ్నీ, గ్రాండ్ విటారా వంటి మోడళ్లను విక్రయిస్తున్న కంపెనీ.. విక్టోరిస్ పేరుతో మరో కాంపాక్ట్ ఎస్‌యూవీని బుధవారం ఆవిష్కరించింది. హ్యుండయ్ క్రెటా, కియా సెల్టోస్, హోండా ఎలివేట్, టయోటా హైరైడర్, టాటా కర్వ్, స్కోడా కుషాక్, ఫోక్స్‌వేగన్ టైగున్‌కు పోటీగా ఈ కారును మార్కెట్లోకి ప్రవేశపెడుతోంది. 1.5 లీటర్ పెట్రోల్, సీఎన్‌జీ, హైబ్రిడ్ ఇంజన్ ఆప్షన్లతో కూడిన ఈ కారును అరెనా షోరూమ్స్ ద్వారా విక్రయించనున్నట్లు కంపెనీ తెలిపింది. మొత్తం ఆరు వేరియంట్లు, పది రంగుల్లో లభించనున్న ఈ కారులో మారుతి పలు ఆధునిక ఫీచర్లను అందుబాటులోకి తెచ్చింది. రూ.11,000తో బుకింగ్ సౌకర్యాన్ని ప్రారంభించిన కంపెనీ.. కారు ధరను త్వరలోనే ప్రకటించనుంది. దీని ప్రారంభ ధర రూ.9.75 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా. భద్రతకు సంబంధించి ఈ కారుకు 5-స్టార్ భారత్ ఎన్‌క్యాప్ సేఫ్టీ రేటింగ్ లభించినట్లు సంస్థ తెలిపింది.

సెన్సెక్స్ 410 పాయింట్లు అప్

తొలుత తడబాటు.. ఆఖర్లో జోరు

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం ట్రేడింగ్‌లో మధ్యాహ్నం వరకు లాభనష్టాల మధ్య ఊగిసలాడినప్పటికీ, ఆఖరి గంటలో భారీగా పుంజుకున్నాయి. దాంతో సెన్సెక్స్ 409.83 పాయింట్ల వృద్ధితో 80,567.71 వద్ద, నిఫ్టీ 135.45 పాయింట్ల పెరుగుదలతో 24,715.05 వద్ద ముగిశాయి. జీఎస్‌టీ మండలి సమావేశంలో తీసుకోబోయే నిర్ణయాలపై ఆశాభావంతోపాటు మెటల్ షేర్లలో ర్యాలీ ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 21 రాణించాయి. టాటా స్టీల్ షేరు 5.90 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.90% శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.63% ఎగబాకాయి. రంగాలవారీ సూచీల్లో మెటల్ 3.08 శాతం పుంజుకోగా.. కమోడిటీస్, హెల్త్‌కేర్ ఒక శాతానికి పైగా పెరిగాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మరో రూ.1,666.46 కోట్ల నికర అమ్మకాలకు పాల్పడగా.. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు నికరంగా రూ.2,495.33 కోట్ల కొనుగోళ్లు జరిపారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఆల్‌టైం కనిష్ఠ స్థాయి నుంచి కాస్త కోలుకుంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 9 పైసలు పెరిగి రూ.88.06 వద్ద ముగిసింది.

హైదరాబాద్-ఆమ్‌స్టర్‌డామ్ మధ్య డైరెక్ట్ విమాన సర్వీసు

కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నెదర్లాండ్ కేంద్రంగా పనిచేసే కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ మన దేశంలో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్ నుంచి నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డామ్‌కు డైరెక్ట్ విమాన సర్వీసులు ప్రారంభించింది. వారానికి మూడు రోజులు ఈ సర్వీసులు నడుస్తాయని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మార్టెన్ స్టీనెన్ చెప్పారు. బెంగళూరు, ఢిల్లీ, ముంబై తర్వాత భారత్‌లో హైదరాబాద్ తమకు నాలుగో ప్రవేశ ద్వారమని తెలిపారు. ప్రస్తుతం ఈ నాలుగు నగరాల నుంచి ఆమ్‌స్టర్‌డామ్ వారానికి 24 విమాన సర్వీసులు నడుపుతోంది. వింటర్ సీజన్‌లో ఈ సర్వీసులను 27కు పెంచనున్నట్టు మార్టెన్ స్టీనెన్ చెప్పారు. ఫార్మా, ఐటీ కంపెనీలకు కేంద్రంగా ఎదిగిన హైదరాబాద్ నుంచి సరుకు రవాణాకు అద్భుత అవకాశం ఉందన్నారు. బోయింగ్ 777-200ఈఆర్ విమానాలతో ప్రారంభించిన హైదరాబాద్-అమెస్టర్‌డ్యామ్ విమాన సర్వీసులో వివిధ తరగతుల్లో 288 మంది ప్రయాణించ వచ్చని కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ అధికారులు చెప్పారు.

హైదరాబాద్‌లో యునిస్పేస్ మెగాస్టోర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నిర్మాణ, నిర్మాణ పరికరాల రంగంలోని అపర్ణా ఎంటర్‌ప్రైజెస్ (ఏఈఎల్) హైదరాబాద్‌లోని మియాపూర్‌లో యునిస్పేస్ మెగాస్టోర్‌ను ప్రారంభించింది. ఇది ఆసియాలోనే అతి పెద్ద స్టోర్ అని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. తమ రిటైల్ విస్తరణలో భాగంగా బెంగళూరు, ఢిల్లీ, ముంబై నగరాల్లో కూడా ఇదే తరహా స్టోర్లు ప్రారంభించాలనుకుంటున్నట్టు చెప్పారు. భవన నిర్మాణంలో ఉపయోగించే 20 రకాల వస్తువులకు ఇది వన్ స్టాప్ సొల్యూషన్‌గా ఉంటుందని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ శ్రేయాస్ త్రివేది వెల్లడించారు. కస్టమర్లకు ఇంటి డిజైన్, నిర్మాణం, ఆధునీకరణ వంటి సేవలన్నీ ఒకే ఛత్రం కింద అందించాలన్నది తమ కాన్సెప్ట్ అని ఆయన చెప్పారు. ఇది కస్టమర్లకు సరికొత్త అనుభూతిని అందిస్తుందని ఆయన అన్నారు.

ఇంటర్వ్యూ..

బాధితులకు తక్షణమే న్యాయం

● రవి, ఎస్ఐ, ఇటిక్యాల



ఎర్రవల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్‌కు వివిధ సమస్యలపై వచ్చే బాధితులకుతక్షణమే న్యాయం జరిగేలా కృషి చేస్తానని, క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేస్తానని ఇటిక్యాల ఎస్ఐ రవి అన్నారు. బుధవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వెల్లడించారు.

స్టేషన్‌కు వచ్చిన బాధితులతో ఎలా మెలుగుతారు?

సమస్యలపై పోలీసు స్టేషన్‌కు వచ్చిన వారితో స్నేహపూర్వకంగా మెలుగుతాం. వారి సమస్యలను తెలుసుకుని విచారణ చేపట్టి, తగిన న్యాయం చేస్తాం.

రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఏం చేస్తున్నారు?

44వ జాతీయ రహదారిపై ఎర్రవల్లి చౌరస్తా ప్రధాన కూడలిలో ఇద్దరు సిబ్బందిని నియమించాము. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. తాగి వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకుంటున్నాం.

అక్రమ రవాణాను అడ్డుకుంటున్నారా?

అక్రమ రవాణా విషయంలో సమాచారం మా దృష్టికి వచ్చిన వెంటనే స్పందిస్తాము. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

గణేశ్ నిమజ్జనంలో భద్రతా చర్యలు తీసుకుంటున్నారా?

కృష్ణానది వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో నిమజ్జనానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. బీచుపల్లి కృష్ణానది దగ్గర నిమజ్జనానికి ఏర్పాట్లు చేశాం. అన్నిశాఖల సమన్వయంతో భద్రతా చర్యలు చేపట్టాం.

న్యూస్ బాక్స్

ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

- ఎంపీడీవో రాఘవ

మానవపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇళ్లులేని పేదలను గుర్తించి త్వరగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలని ఎంపీడీవో రాఘవ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతీ గ్రామానికి 15నుంచి 35వరకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, కొన్నిగ్రామాల్లో నత్తనడకన పనులు సాగుతున్నాయని అన్నారు.

ఎంపీడీవోకు బీజేపీ నాయకుల సన్మానం



ఎంపీడీవో ప్రవీణ్‌రెడ్డిని సన్మానిస్తున్న శశికుమార్, నాయకులు

రాజోలి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌రెడ్డిని బుధవారం కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు శశికుమార్ పార్టీ నాయకులతో కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి, గోవిందరాజులు, ఈసీ అంజి, రాజేశ్, మల్లేశ్ ఉన్నారు.

రోగులకు మనోధైర్యాన్ని ఇచ్చేది నర్సులే

- సూపరింటెండెంట్ సయ్యద్ బాషా



నర్సు భాగ్యమ్మను సన్మానించి కానుకను అందిస్తున్న సూపరింటెండెంట్

అలంపూర్ సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవలో రోగులకు మానసిక ధైర్యాన్ని ఇచ్చేది నర్సులే అని అలంపూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ సయ్యద్ బాషా అన్నారు. ఇటీవల పదవీ విరమణ చేసిన స్టాఫ్ నర్సు భాగ్యమ్మకు వీడ్కోలు సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్‌బాషా మాట్లాడుతూ ఆప్యాయంగా పలకరిస్తూ రోగులకు ధైర్యం చెప్పడంలో నర్సులపాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. అనంతరం వైద్యసిబ్బంది, డాక్టర్లు కలిసి నర్సు భాగ్యమ్మకు శాలువా, పూలమాలలతో సన్మానం చేసి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

● యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేశ్

ఉండవల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేశ్ కోరారు. గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న డీఏలను సత్వరమే ప్రకటించి పీఆర్‌ఎస్‌సీ వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఉండవల్లి మండలంలోని తక్కశిల, భైరాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎంలకు ఉపాధ్యాయులు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్‌నాయుడు, మండల అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శులు మునిస్వామి, యూటీఎఫ్ సభ్యులు ఉన్నారు.

శిథిలావస్థలో పెద్దదిన్నె పాఠశాల

● గత ఏడాది ట్విట్టర్ ద్వారా సీఎం దృష్టికి పాఠశాల సమస్య

● పెచ్చులూడిన పైకప్పు

● వర్షానికి తరగతి గదుల్లోకి నీరు

● చెట్లకింద తరగతుల నిర్వహణ



శిథిలావస్థలో ఉన్న పెద్దదిన్నె ప్రాథమిక పాఠశాల భవనం



పెచ్చులూడిన పైకప్పు

ఎర్రవల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఇటిక్యాల మండంలోని పలుగ్రామాల్లో పాఠశాల భవనాలు చూస్తే భయం పుట్టాల్సిందే. ఎప్పుడు కూలుతాయో స్థితిలో ఉన్నాయి. సరిపడా తరగతి గదులు లేక, శిథిలానికి చేరిన భవనాలు, వంటగదులు, మరుగుదొడ్లతో ప్రమాదకర పరిస్థితుల్లో విద్యార్థులు చదువుకుంటున్నారు.

మండలంలోని పెద్దదిన్నె గ్రామంలో ఏళ్లక్రితం నిర్మించిన పాఠశాల భవనం, నేడు శిథిలావస్థకు చేరింది. వానకాలంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. ఈ పాఠశాలలో 7వ తరగతి వరకు విద్యాభ్యాసం కొనసాగుతుంది. ఇందులో 105మంది విద్యార్థులుంటారు. నలుగురు ఉపాధ్యాయులతో బోధన కొనసాగుతున్నప్పటికీ భవనం పరిస్థితి మాత్రం శిథిలావస్థకు చేరింది. దాదాపు ఐదు దశాబ్దాల క్రితం పాఠశాల నిర్మించినట్లు తెలిసింది. మరమ్మతులు జరుగుతున్నాయి కానీ భవనం కాలం చెల్లడంతో పూర్తిగా దెబ్బతిని వర్షం వస్తే తరగతి గదుల్లో నీళ్లు కారుతుంటుంది. ఈ సమస్యపై పెద్దదిన్నె పాఠశాల విద్యార్థులు గత సంవత్సరం నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ట్విట్టర్ ద్వారా విన్నవించినట్లు తెలిపారు. అయినా నేటి వరకు అక్కడ ఎలాంటి పనుల కోసం ప్రతిపాదనలు లేవు. ఎర్రవల్లి మండలంలోని కొండేరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు వల్లూరు ప్రాథమిక పాఠశాలలు కూడా వర్షాకాలంలో నీళ్లు కారుతున్నాయి. కొండేరు పాఠశాలలో 190 మంది విద్యార్థులుంటారు. కారుతున్న గదిని ఎప్పుడు కూలుతుందో అనే భయంతో మూసివేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శిథిలానికి చేరిన భవనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నూతన భవనాలు నిర్మాణానికి లేదా మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించి ఏర్పాటు చేసే దిశగా కృషి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

కొత్త భవనం నిర్మించాల్సిందే



పెద్దదిన్నె పాఠశాల దశాబ్దాల క్రితం నిర్మించినది. ప్రస్తుత్తం భవనం పరిస్థితి పూర్తి శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో భయంభయంగా తరగతులు నిరహిస్తున్నాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. సమస్య తీవ్రంగా ఉండటంతో విద్యార్థులు ట్విట్టర్ ద్వారా నేరుగా ముఖ్యమంత్రికి విన్నవించారు.

- కరేందర్, హెచ్ఎం, పెద్దదిన్నె

ముఖ్యమంత్రికి లేఖ రాశా



వర్షాకాలంలో తరగతి గదుల్లోకి నీళ్లు చేరుతున్నాయి. భయంభయంగా చదువుకుంటున్నాం. ఎప్పుడు పడిపోతుందోనని భయాందోళనతో ఉన్నాం. కొత్త భవనం కట్టించాలని లేఖను రాసి, ట్విట్టర్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి సార్‌కి పంపించాను.

- అఖిల్, 7వ తరగతి

ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం

● ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

● అయ్యప్ప కన్నె స్వాముల ఆశ్రమానికి భూమిపూజ



అయ్యప్ప కన్నెస్వాముల ఆశ్రమానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల అభి వృద్ధికి తనవంతు తోడ్పాటునందిం చేందుకు ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటామని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి అన్నారు. సమాజం లో శాంతి, సుహృద్భావం నెలకొల్పేం దుకు ఆధ్యాత్మిక భావన అవసరమని, ఇందు కు మనకు ఆలయాలే వేదికలన్నారు. బుధవా రం పట్టణంలోని పాతహౌసింగ్ బోర్డుకాలనీ అయ్యప్ప స్వామి ఆలయంలో కన్నెస్వాముల ఆశ్రమ నిర్మాణ కోసం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 41రోజుల పాటు నిష్ఠతో ఉపవాస దీక్షలు చేసే స్వాములకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ కమిటీ చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. ఇందుకు తనవంతు తోడ్పాటునందిస్తానన్నారు. అయ్యప్పస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు వైండింగ్ రాములు మాట్లాడుతూ మాలధారులకు అన్నిసదుపాయాలతో ఉండే విధంగా ఆశ్రమ నిర్మాణ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి టెంకాయల రవి, మేడిశెట్టి బాలస్వామి, డాక్టర్ అవినేష్, శ్రీనివాస్‌రెడ్డి, రవి, నరేందర్, సోని శ్రీనివాస్, రవి రెడ్డి, ప్రసాద్, లోకేశ్ ఉన్నారు.

దిగుమతి సుంకాన్ని యథావిధిగా ఉంచాలి

● తహసీల్దార్‌కు రైతు సంఘం నాయకుల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ధరూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దిగుమతి పన్నును యధావిధిగా ఉంచాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.గోపాల్ కోరారు. ఈమేరకు బుధవారం ధరూరు మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌కు రైతు, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన గోపాల్, ఇతర దేశాల్లో పండించే పంటలను మన దేశంలో అమ్ముకునేందుకు కేంద్ర ప్రభుత్వం దిగుమతి పన్నును 11శాతం తగ్గించే తాము విషయాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇతర దేశాల్లో పండించిన పత్తిని మన దేశంలో అమ్మికోవడానికి దిగుమతి సుంకాన్ని తగ్గించడం పట్ల కేంద్ర ప్రభుత్వం మన దేశ రైతులు నష్టపోయే విధంగా పన్నును అమలు చేస్తుందన్నారు. దేశ పత్తి రైతులు గిట్టుబాటు ధరలు లేక ఇప్పటికే ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం మన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడం శోచనీయమన్నారు. 2025 ఆగస్టు 19న కేంద్ర ప్రభుత్వం పత్తిపై 11శాతం దిగుమతి సుంకాన్ని తొలగిస్తూ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. అమెరికా సామ్రాజ్యవాదుల ఒత్తిళ్లకు లొంగి ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల రైతాంగం తీవ్రఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పత్తి పంటకు కనీస మద్దతు ధర క్వింటాకు రూ.10,075లు నిర్ణయించాలని, సంపూర్ణ రుణమాఫీ చేయాలని, రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలకు రూ.25లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు నాగరాజు, ప్రవీణ్, దామోదర్, పత్తి రైతులు మధు, రామకృష్ణ, మరియమ్మ, పద్మమ్మ, అయ్యన్న ఉన్నారు.

సృజనాత్మకతతో నైపుణ్యం పెంచుకోవాలి : డీఐఈవో

గద్వాల టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వృత్తి విద్య కోర్సు విద్యార్థులు సృజనాత్మకతను కలిగి ఉండటం ద్వారా నైపుణ్యాన్ని పెంచుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి హృదయరాజు సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్రియేటీవిటీ క్లబ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కమ్యూనికేషన్, సృజనాత్మకత, కొలాబరేషన్ వంటి అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. డ్రాయింగ్ డిజైన్ పేరుతో చేపట్టిన కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ అంశాలపై నైపుణ్యం కల్పించారు. కిచెన్ కెమిస్ట్రీ ప్రోగ్రాం ద్వారా వంటింట్లో అందుబాటులో ఉండే వస్తువుల ద్వారా చేపట్టే రసాయనిక ప్రయోగాలు, ఫలితాలు వివరిస్తూ సైన్స్ పట్ల ఆసక్తిని పెంచే ప్రయత్నంచేశారు. తోలుబొమ్మల ఆట అంశాలపై పపెట్ మేకింగ్ కార్యక్రమం నిర్వహించిన బొమ్మల ద్వారా సందేశాత్మకమైన అంశాలను వెల్లడింగే నైపుణ్యం గురించి సంస్థ కోఆర్డినేటర్ మల్లయ్య విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరన్న, అధ్యాపకులు దేవేందర్‌రెడ్డి, వీరేశం, సంస్థ ప్రతినిధి జైపాల్ ఉన్నారు. అనంతరం వర్క్‌షాప్‌కు హాజరైన విద్యార్థులకు సంస్థ తరఫున డీఐఈవో చేతులమీదుగా ధ్రువపత్రాలు అందజేశారు.

రాష్ట్ర స్థాయి యువ ప్రో కబడ్డీ విజేత గద్వాల



కబడ్డీ విజేత జట్టుతో డీకే స్నిగ్ధా రెడ్డి

● జట్టును అభినందించిన డీకే స్నిగ్ధా రెడ్డి

గద్వాలఅర్బన్, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి యువ ప్రో కబడ్డీ పోటీల్లో జోగుళాంబ గద్వాల జిల్లా లైన్స్ జట్టు మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ డీకే స్నిగ్ధా రెడ్డి తెలిపారు. జిల్లా జట్టు విజయం సాధించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్‌ను తిలకించిన ఆమె జట్టును అభినందించారు. ఫైనల్‌లో పోరులో యాదాద్రి వారియర్స్ జట్టుపై 33-20 పాయింట్ల తేడాతో జిల్లా జట్టు విజయం సాధించిందని కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి నరింహ తెలిపారు. విజేత జట్టుకు రూ.లక్ష నగదు అందజేశారన్నారు. అభినందించిన వారిలో అబ్రహం, బండల వెంకట్రాములు, చందు, రవి, వెంకటేశ్వర్ రెడ్డి, సురేష్ ఉన్నారు.

నేడు పాతవస్తువుల వేలం పాట : ఎస్పీ

గద్వాల క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా కేంద్రంలోని సాయుధ దళ కార్యాలయంలో శుక్రవారం(4వ తేదీ)న పోలీస్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ సెక్షన్‌కు సంబంధించి పాతవస్తువుల వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టైర్స్ ట్యూబ్స్, బ్యాటరీస్, ఇతర స్పేర్‌పార్ట్స్ ఉన్నాయని తెలిపారు. పాత సాయుధ దళ కార్యాలయంలో శుక్రవారం వేలంపాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎర్రమట్టి తరలింపుపై విచారణ



విచారిస్తున్న జిల్లా మైనింగ్ ఏడీ రమణ

అయిజ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అయిజ సమీపంలోని తుపతురాలలోని 472 సర్వే నెంబరు నుంచి తరలుతున్న ఎర్రమట్టిపై మైనింగ్, రెవెన్యూఅధికారులు విచారణ చేపట్టారు. రెండు రోజులుగా పర్దీపూర్ నుంచి ఎర్రమట్టి టిప్పర్ల ద్వారా తరలుతోంది. ఈనేపథ్యంలో రాములు అనే వ్యక్తి కలెక్టర్‌క ఫిర్యాదు చేశారు. ఈమేరకు బుధవారం మైనింగ్ ఏడీ రమణ అయిజ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్‌రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి వివరించారు. తాము అనుమతులు ఇచ్చినప్రాంతాల నుంచి ఎర్రమట్టి తరలుతోందని నిర్ధారించారు. ఇదే నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

అలంపూర్‌లో మహిళా ఓటర్లే అధికం

- ఎంపీడీవో పద్మావతి

అలంపూర్, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): అలంపూర్ మండల కేంద్రంలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని ఎంపీడీవో పద్మావతి అన్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో భాగంగా అలంపూర్ మండలంలోని 14 గ్రామాల తుదిఓటర్ల జాబితాను ఎంపీడీవో పద్మావతి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ జాబితా ప్రకారం మండలంలో మొత్తం 17,375 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇందులో 8,582 మంది పురుషులు కాగా, 8793మంది మహిళలు ఉన్నారని, దీనితో మండలంలో పురుషులకంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు స్పష్టం అవుతుందని తెలిపారు.

సబ్సిడీపై యంత్ర పరికరాలు

ఇటిక్యాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ పథకం ద్వారా 50శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లను అందించనున్నట్లు ఏవో రవికుమార్ తెలిపారు. ఇటిక్యాల మండల పరిధిలో 114బ్యాటరీ స్ప్రేయర్లు, ఆరు రోటోవేటర్లు, రెండు బ్రష్ కట్టరుల, ఒక పవర్ టిల్లర్, వరిగడ్డి కట్టలు కట్టే యంత్రాలు అందిస్తామన్నారు. ఈనెల 10లోపు సంబంధిత ఏవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఇటిక్యాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. గణేశ్ నిమజ్జనం సందర్భంగా గత ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కర్నూలు ఆస్పత్రికి తరలించగా, ఇటిక్యాలకు చెందిన తెలుగు నర్సింహులు కుమారుడు తెలుగు నరేందర్(25) చికిత్స పొందుతూ మృతి చెందాడు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



ఎర్రవల్లి తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

ఎర్రవల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం కలెక్టర్ సంతోష్ ఆకస్మికంగా సందర్శించారు. భూ భారతి దరఖాస్తులు, పెండింగ్‌లో ఉన్న ఆన్‌లైన్ దరఖాస్తులు, రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ ఎలా చేస్తున్నారని తెలుసుకున్నారు. సాంకేతికంగా భూభారతి ప్రాసెస్‌ను అరగంటకుపైగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీలార్ నరేశ్, ఎంపీడీవో సాయిద్‌ఖాన్, ఆర్ఐ శంషీర్ ఉన్నారు.

వినాయకునికి ప్రత్యేక పూజలు



రెవెన్యూ కాలనీలో గణేశ్ విగ్రహానికి పూజలు చేస్తున్న బండ్ల జ్యోతి

గద్వాల సర్కిల్, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): గద్వాలలోని 16వ వార్డు రెవెన్యూ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహ మండపంలో బుధవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కాంగ్రెస్ నేతలు గడ్డం కృష్ణారెడ్డి, నాగశంకర్, మధు, లక్ష్మణ్(రాంబో), నాగేంద్రయాదవ్, నెమలకంటి రామాంజనేయులు, నరహరి, కిరణ్‌లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు రెవెన్యూ కాలనీలో ప్రతిష్ఠించిన గణేష్‌విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ అక్కల రమాసాయిబాబ, బీజేపీ నాయకులు త్యాగరాజు, మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ పాలక మండలి

గద్వాలన్యూటౌన్, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గద్వాల జిల్లా పాలకమండలికి ఎన్నికైన నూతన కార్యనిర్వాహక సభ్యులు గురువారం క్యాంపు కార్యాలయంలో కలెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు బీఎం సంతోష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే, శాలువాతో సన్మానించారు. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయం, రక్తనిధికేంద్రం, ఈ మధ్యనే మంజూరైన వయోవృద్ధుల డే కేర్ సెంటర్ స్థలం విషయంలో కలెక్టర్‌తో చర్చించారు. ఈసందర్భంగా కలెక్టర్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన పాలకమండలిని గౌరవిస్తూ మీరు చేసే అన్ని కార్యక్రమాలకు నా సంపూర్ణ సహకారం ఉంటుందని కలెక్టర్ హామీ ఇవ్వడం జరిగింది. అలాగే నూతన పాలక మండలి సభ్యులు అదనపు కలెక్టర్, రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణను సన్మానించారు.

కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ సంగా అయ్యపురెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు రమేశ్, ఉపాధ్యక్షుడు తాహెర్, కోశాధికారి ధనలక్ష్మి, కార్యనిర్వాహక సభ్యులు అప్సర్‌పాష, గంగాధర్‌గౌడు, లక్ష్మీనారాయణగౌడు, అక్బర్‌బాషా, నల్లారెడ్డి, పాల్‌సుధాకర్, మోహన్‌రావు ఉన్నారు.

బీచుపల్లిలో సినీ నిర్మాత అల్లు అరవింద్

- తల్లి కనకరత్నం అస్థికలు కృష్ణానదిలో నిమజ్జనం



బీచుపల్లిలో తన తల్లి కనకరత్నం అస్థికల నిమజ్జన కార్యక్రమంలో అల్లు అరవింద్, తనయుడు బాబి

ఎర్రవల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గీతా ఆర్ట్స్ అధినేత, సినీ నిర్మాత అల్లు అరవింద్ తన తల్లి కనకరత్నం అస్థికలను జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి వద్ద కృష్ణానదిలో కలిపేందుకు బుధవారం వచ్చారు. ఆయన తల్లి కనకరత్నం ఇటీవల పరమపదించిన విషయం తెలిసిందే. అమె అస్థికలకు పుష్కరఘాట్ పురోహితుడు అనిల్‌శర్మ వేదమంత్రోచ్చరణ మధ్య పూజా కార్యక్రమం నిర్వహించారు. పడవలో వెళ్లి నదిలో కలిపారు. అనంతరం నది ఒడ్డున స్నానమాచరించిన అల్లు అరవింద్ వెళ్లిపోయారు. ఆయనతో పాటు పెద్దకుమారుడు అల్లు బాబి ఉన్నారు.

పేదోడి అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

- డీసీసీ కార్యదర్శి సిరాజ్

మానవపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పేదల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయంగా పనిచేస్తున్నదని డీసీసీ కార్యదర్శి సిరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని గోకులపాడులో ఇందిరమ్మ లబ్ధిదారులను కలిసి ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం అమరవాయిలో నూతన రేషన్ కార్డు దారులకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు నరసింహ, గాండ్ల రమేశ్, ప్రసాద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

అలరించిన రన్నింగ్ రాజా టీమ్

మానవపాడు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాగులకుంట కాలనీలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి వినాయకుడు బుధవారం నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమానికి జబర్దస్త్ అర్టిస్టులు రన్నింగ్ రాజా, హర్షిత, సుధ హాజరై కామెడీ, నృత్యాలు చేశారు. వారి కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు, గ్రామస్థులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఏపీలోని కోడుమూరు మండలం ఎర్రదొడ్డి నుంచి రన్నింగ్ రాజా, హైదరాబాద్ నుంచి హర్షిత, విజయవాడ సుధ హాజరయ్యారు.

యూరియా కోసం పడిగాపులు

అయిజ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. పంపిణీ కేంద్రాల వద్ద పొద్దస్తమానం పడిగాపులు కాస్తున్నారు. బుధవారం అయిజ మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద కవర్లు, సంచులు, చెప్పులను క్యూలైన్లో ఉంచి యూరియా కోసం ఎదురుచూశారు. అనంతరం ఒక్కో రైతుకు రెండు సంచుల చొప్పున యూరియా పంపిణీ చేశారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

ఉండవల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబార్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 7న నిర్వహించే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ కోరారు. సదస్సు పోస్టర్లను బుధవారం ఉండవల్లి మండల కేంద్రంలో నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు కంచుపాడు పరశురాముడు, నాగేష్, మద్దిలేటి స్వామి, సంధ్యారాణి, పద్మమ్మ ఉన్నారు.

నిర్మాణ రంగ కార్మికుల చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలి

● సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వంగూరు రాములు



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వంగూరు రాములు

గద్వాల టౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికులకు 1996 కేంద్ర కార్మిక చట్టం ద్వారా తగిన తోడ్పాటునందించాలని సీఐటీయూ అనుబంధ నిర్మాణ రంగం కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వంగూరు రాములు కోరారు. 1996 కార్మిక చట్టాన్ని సక్రమంగా అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. బుధవారం పట్టణంలోని వాల్మీకి భవన్‌లో తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ ఫెడరేషన్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామ్మోహన్, కోటంరాజు రత్నాకర్ మాట్లాడుతూ నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా 11 రకాల పథకాలు అమలుచేయాల్సి ఉన్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. పైగా సంక్షేమం బోర్డు నిధులను ఇతర అవసరాలకు వినియోగిస్తుండటం విచారకరమన్నారు. ప్రభుత్వపరంగా అందించే ఆర్థిక తోడ్పాటుతో 22 రకాల పరీక్షలు నిర్వహించి చికిత్స ఇవ్వాల్సి ఉన్నా కేవలం రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహించారన్న పేరుతో పలు ప్రైవేట్ కంపెనీలకు రూ.460కోట్లు అప్పగించడం శోచనీయమన్నారు. కాగా, ప్రస్తుతం కార్మికుల నిధులను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించేందుకు ప్రయత్నిస్తుండటం సరికాదన్నారు. గద్వాల జిల్లాలో మధ్యదళారుల సహకారంతో అనర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, వీటిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు. నిర్మాణ రంగ కార్మికుల రాష్ట్రస్థాయి మహాసభలు ఈనెల 22, 23 తేదీల్లో భద్రాచలం, అనంతరం రాజస్థాన్‌లోని సికార్‌లో జాతీయ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభలకు జిల్లా నుంచి పెద్దఎత్తున కార్మికులు తరలిరావాలని కోరారు.

సమావేశంలో సీఐ టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వా మి, వివి నరసింహ, ఉప్పేరు నరిసింహా, నిర్మా ణ కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ, వెం కటేష్, అంజి, కదీర్, రవి, గోపాల్ పాల్గొన్నారు.